# బాధ్యతాబంధం

-శారదా అశోక్‌వర్ధన్

"ఒరేయ్ మురళీ! టైమయిపోతోందిరా. నువ్విలాగే ఇంకా ముస్తాబవుతూ కూర్చో. ఫ్లైట్ వచ్చేస్తుంది. తొందరగా తెములు" బామ్మ మురళిని తొందర పెడుతోంది. గబగబా బూట్లు వేసుకుని క్రాఫుని మళ్లీ ఒక్కసారి అద్దంలో సరిచేసుకుని మరోసారి అద్దంలో మొహం చూసుకుని బయలు దేరాడు మురళి.

"ఎంత షోకురా నాయనా...ఆడపిల్లవై పుట్టాల్సింది. అయినా ఈ రోజుల్లో ఆ తేడాలేంలేవులే నా పిచ్చిగానీ. వాళ్లకీ రకరకాల క్రిములూ, సెంట్లు...ఎన్నో! కాలం మారిపోయింది" నవ్వుతూనే అంది బామ్మ.

మా బామ్మ నవ్వితే అచ్చు నిర్మలమ్మలా వుంటుందంటారు అందరూ.

"కువైట్ నుంచి మా అక్కగారు డాక్టర్ నిఖిల, బావగారు డాక్టర్ మాధవ్‌గారు వస్తూ వుంటే ఎయిర్‌పోర్ట్‌కి నన్ను దేభ్యం మొహం వేసుకుని వెళ్లమంటావా?" కారు తాళాల కోసం ఒక్క క్షణం జేబులన్నీ వెతికి చివరికి పాంటు వెనుక జేబులోనే తాళాలు చేతికి తగలగానే తీసి నవ్వుతూ బయలు దేరాడు మురళి.

"అమ్మా! పెళ్లికూతుర్ని చేయడానికి ముహూర్తం దాటిపోతుంది. వారొచ్చేలోగా ఎవరైనా పెద్దలు ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టండి" పురోహితుడి ప్రవచనాలు.

"వస్తున్నామయ్యా...మరీ తొందర పెట్టమాకు. ఆ కూతురు ఫ్లయిట్‌లో ఏం తిన్నా ఏం తాగినా ఇంటికి రాగానే మాత్రం నేను పెట్టిన ఫిల్టర్ కాఫీయే అడుగుతుంది ముందు. వస్తున్నాం. ఒసేవ్ సుభద్రా... శాంతా మీరు కార్యక్రమాన్ని మొదలుపెట్టండి అక్కా, బావగారు వచ్చేలోపల" బామ్మకు కంగారు ఎక్కువవుతోంది.

"అయినా ఏంటమ్మా...స్వంత కూతురు పెళ్లికి కూడా కనీసం పదిరోజులయినా సెలవు పెట్టి రాకుండా ఏదో పరాయి వాళ్ల పెళ్లికి వచ్చినట్లు... ఇలా..."

"ఉష్... ఊరుకోవే.. వాళ్ళు ఆ ఊళ్లోంచి బయటపడాలంటే ఎంత కష్టమో తెలుసా? ఒక పట్టాన వాళ్లని వదిలి పెట్టరు. ఆ ఊర్లో వున్న వాళ్లల్లో ముప్పాతికమందికి నిఖిలే పురుడు పోయాలి. పుట్టిన పిల్లలని పరీక్ష చేసి మాధవే మందులియ్యాలి. అందుకు ఆ దేశం వాళ్ళు వీళ్ల కాళ్లమీద పడతారు కనకవర్షం కురిపిస్తారు. వాళ్లకి నిఖిల, మాధవ్‌లు దేవుళ్ళే దేవుళ్లు..." శాంత పిన్ని మాటల్ని మధ్యలోనే కట్ చేసింది బామ్మ.

"సరేలే నీ కూతుర్ని, అల్లుడ్ని నువ్వలా వెనకేసుకొస్తూ పిల్లల సంరక్షణ కూడా నువ్వే వహిస్తున్నావుగా" నిష్ఠూరంగానే అంది శాంత.

"ఎంతైనా అమ్మకి అక్కయ్యంటే మనమీద కన్నా కొంచెం ప్రేమ ఎక్కువే. నాలుగు చేతులా సంపాదించే కుటుంబం కదా" వంత పలికింది సుభద్ర.

"ఏమిటర్రా మీ గోల? తల్లికి బిడ్డలంతా సమానమే. వాళ్ల వాళ్ల పరిస్థితులనుబట్టి సమర్థించడం జరుగుతుంది" అంది బామ్మ.

వీళ్ల మాటలు వింటున్న సింధూ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఎవరైనా చూస్తే ఈ శుభ సమయంలో ఈ కన్నీరేమిటని అనుకుంటారేమోనని వెంటనే చేతి రుమాలుతో కళ్ళు తుడుచుకుంది సింధూజ.

అంతలోనే సుభద్ర పిన్ని, శాంత పిన్ని వచ్చి ఒకరు తలకి డ్రైయర్ వేసి జుట్టారడానికి, ఒకరు చీరకట్టి సింగారించడం మొదలుపెట్టారు. ఈలోగా తన ఫ్రెండ్స్ వెన్నెల, మల్లిక, పర్వీరిష్, ఉయిదా వచ్చారు.

అలంకరణ వాళ్ళు మొదలుపెట్టారు.

"అమ్మా! తొందరగా కానివ్వండి. అమ్మాయి గౌరీ పూజకి కూర్చోవాలి" పురోహితుడు తొందర పెడుతున్నాడు.

"మీ మమ్మీవాళ్లింకా రాలేదా?" అడిగింది వెన్నెల.

"లేదు. ఫ్లైట్ గంట లేటుట. పెళ్లి సమయానికి వస్తారేమో" పేలవంగా నవ్వింది సింధూజ.

"ఈరోజుల్లో ఫ్లయిట్ రైళ్లలాగే ఒక్కొక్కసారి సగం రోజు, పూర్తిరోజుదాకా లేటే వస్తున్నాయి. మొన్న మా ముంబాయి మామయ్యగారి ఫ్లయిట్ అలాగే అయింది. ఆ రోజు రావాల్సిన ఫ్లైటు ఆ మర్నాడు వచ్చింది" అంది మల్లిక.

"దెన్...హౌ? పెళ్లిపీటల మీద కూర్చోవాలిగా మమ్మీ డాడీ?" అంది పర్వీరిష్.

సింధూజ నవ్వుతూ "దానికేంలే మా సుభద్ర పిన్నీ, బాబాయ్ కూర్చుంటారు. ఏదీ ఆగిపోదు. అన్నింటికీ ఎమెండ్‌మెంట్సూ, సబ్‌స్టిట్యూట్స్



ఉన్నట్టే దీనికీనూ..'' సింధూజ మాటల్లో ఆవేదన తొణికిసలాడింది.

అలంకరణ పూర్తయింది. అంతలోనే సుడిగా లిలా వచ్చింది కామేషాంటీ.

"అదేంటీ...అలంకరణ అంతా అయిందికానీ కాళ్లకి పారాణి పెట్టలేదే?'' అడిగింది.

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని "అవును'' అంటూ లోపలికెళ్లారు. శాంత పిన్ని పసుపుగిన్నె, సున్నం గిన్నె, కుంకుమ భరిణలతో వచ్చింది.

"ఇటివ్వండి. నేను పెట్టేస్తాను. మీరు మరో పనే దైనా చూసుకోండి'' అంటూ సుడిగాలిలా కామేష్ ఆంటీ ఆమె చేతిలోంచి పళ్లాన్ని అందుకుంది.

కామేషాంటీని చూడగానే సింధూజ మొహం వెయ్యి కాండిల్స్ ఫ్లడ్‌లైట్స్‌లా వెలిగిపోయింది.

"ఆంటీ... మీరు కూడా లేటుగా వచ్చారేంటి?'' అంది సింధూజ.

"సింధూ...మా తమ్ముడి కొడుకు వొడుగు నుంచి రాత్రే వచ్చాం. ఇవ్వాళ చాలా పెళ్లిళ్ళున్నాయిట. ఒక్క ఆటో దొరకలేదు. ఏం చేయాలో తెలీలేదు. టాక్సీకి ఫోన్ చేస్తే గంట తరువాత పంపిస్తానన్నాడు. నమ్ముతావా? రోడ్డుమీద గంటసేపు నుంచున్నాక సైకిల్‌రిక్షా నా కోసమేనన్నట్లు ఖాళీగా వచ్చింది. ఆశ్చర్యపోయాను. అసలిప్పుడు రిక్షాలు లేవుగా. అదే అడిగితే ఆ రిక్షావాడు అప్పుడప్పుడు ఎమర్జెన్సీలో సామాన్ల సరఫరాకి వాడుతాడుట పోలీసుల కంటపడకుండా. అంతలోనే అదృష్టం ఆటో కనబడింది. ఆపి ఎక్కేసాను'' నవ్వేసింది.


అందరూ నవ్వేసారు.

"మా కామేషాంటీ ఎక్కడుంటే అక్కడ నవ్వులు పూస్తాయి'' అంది సింధూ ఆమెని తృప్తిగా కౌగలించుకుంటూ.

అంతలోనే కారులోంచి దిగారు నిఖిలా, మాధవ్‌లు.

వెనుక మురళి పెట్టెలు లోపల చేరవేస్తున్నాడు.

నిఖిల వెంటనే కామేశ్వరి కౌగిలి నుంచి సింధూజని విడదీస్తూ "సింధూ మైడియర్! ఐయామ్ సారీ... ఫ్లయిట్ లేటయింది'' అంటూ కౌగలించుకుంది.



వెంటనే తన హ్యాండ్ బ్యాగ్ తెరిచి పెద్ద కెంపుల హారం సింధూ మెడలో వేసింది.

రెండు చేతులకు డజను డజను బంగారు గాజులను తొడిగింది.

పెద్ద పెద్ద జుంకీలు చెవులకి తగిలించింది ఉన్నవి తీసేసి. పదివేళ్లకీ పది ఉంగరాలు తొడిగింది. పాదాలకి బంగారపు పట్టీలు పెట్టింది. బంగారు వడ్డాణాన్ని సింధూ నడుముకి తగిలించింది. చెంపస్వరాలు, పాపిడిబిళ్ల, చివరికి బంగారు కళ్యాణం బొట్టు... సాక్షాత్తూ లక్ష్మీదేవిలా ఉంది సింధూజ. ఆ అట్టహాసానికి అందరూ పక్కకు జరిగారు.

బామ్మ కూతురికీ, అల్లుడికీ ఫిల్టర్ కాఫీ అందించింది. మిగిలినవాళ్లందరికీ వంటవాళ్ళు కాఫీలు అందించారు.


"అక్కా! పెళ్లయిపోతే నువ్వు వెళ్లిపోతావు. ఈ ఇంట్లో ఇంక నేనూ బామ్మే... బోర్" అన్నాడు బంటీ సదరు భార్గవ్.

"నువ్వు కువైట్ వెళ్లిపో అమ్మానాన్నలతో" అంది మల్లిక.

## చిన్ని చిన్ని ఆశ



ఔట్‌డోర్ షూటింగ్స్ అంటే కొంచెం ఇబ్బందే అయినా తారలు బాగా ఎంజాయ్ చేస్తారు. హార్ట్ అండ్ సోల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ కొత్తచిత్రం లారా ఇప్పుడు వంలేషియాలో నాన్ స్టాప్‌గా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో అర్బాజ్‌ఖాన్, అమృతా అరోరా, తన్వీ వర్మ, మహేంద్ర సంధు నటిస్తున్నారు. ఫ్యామిలీ సెంటిమెంట్స్‌తో పాటూ యాక్షన్ కలగలిసిన ఈ చిత్రం తనకి మంచి బ్రేక్‌నివ్వగలదన్న ఆశాభావంతో ఉంది అమృతా అరోరా. ఆశ పడడంలో తప్పులేదుకదా!




"నో వే. వాళ్లిద్దరూ యమ బిజీట. ఇంట్లోనే ఉండరు. అందుకేకదా నేను డాక్టర్‌నయితే వాళ్ళు నన్ను స్పాన్సర్ చేస్తారు" అన్నాడు.

వాడి బాధ ఒక్క సింధూజకే తెలుసు. ఒక్కసారి గతం కళ్లముందు మెదిలింది.

***

స్కూల్లో స్పోర్ట్స్‌డేలు జరిగినా, యాన్యువల్ డే జరిగినా, పేరెంట్ టీచర్స్ డే జరిగినా అనాథల్లా నుంచునేది మేమిద్దరమే. అందరిలాగే తమ అమ్మానాన్నలు రావాలనీ, తామందుకునే బహుమతులు వాళ్ళు గర్వంగా చూస్తుంటే తీసుకోవాలనీ ఆశించారు.

అది జరగకుండానే బాల్యం దాటిపోయింది. బామ్మ తాతగారు కూడా సాధారణంగా వచ్చేవారుకాదు. ఆ...ఏముందిలే ఇవన్నీ వేరు. మీ అమ్మానాన్నల్లాగా బాగా చదువుకోండి అనేవారు. ఇంటికొచ్చాక ఒకమారు ఆ ప్రైజులు చూసి సంతోషించి అలమారలో అలంకరించేవారు. ఒకసారి బంటీని వాడి ఫ్రెండ్ "నీకు అమ్మానాన్నలు లేరా? ఎప్పుడూ రారేమిటి?" అని అడిగితే వాడు ఏడుస్తూ ఇంటికొచ్చి ఆ విషయం బామ్మతో చెబితే ఎన్నిరకాల తిట్లు ఉన్నాయో అన్ని రకాల్లోనూ బామ్మ వాడిని తిట్టిందే కానీ బంటీ ఎంత బాధపడుతున్నాడో ఆలోచించలేదు.

అలాగే తన బాధా ఎవరికీ తెలీదు. అప్పుడే పరిచయమయింది ఢిల్లీ నుంచి ట్రాన్స్‌ఫర్ అయి పక్క సందులో ఒక ఇంట్లోకి దిగిన కామేష్ ఆంటీ. చిత్రంగా ఒక షాపులో జరిగిన వారి పరిచయం ఎన్నో ఆప్యాయతలని ముడివేసింది.

సింధూ, బంటీ ఆమెతో మాట్లాడుతుంటే ఆమెలో తల్లిని చూసుకునేవారు. ఆమె కూడా తల్లిదండ్రులకి దూరంగా వున్న వీళ్ల మీద అంత ప్రేమను చూపించేది. వీళ్ల స్పోర్ట్స్‌డేలకీ, పేరెంట్స్ డేలకి వీళ్లతో వెళ్లేది.

సింధూ బంటీల బహుమతులను చూసి మురిసిపోయేది వాళ్లకింకా పిల్లలు పుట్టలేదు. పెళ్లయి ఒక సంవత్సరమే అయింది. అంకుల్ కూడా అలాగే ఆంటీలాగే ప్రేమగా ఉండేవారు. వీళ్ల ప్రేమకి మేము దాసులమైపోతున్నామనీ, అప్పుడప్పుడు బామ్మ కూడా వీళ్లని తిట్టిపోసేది. వాళ్లింటికి అస్తమానం వెళ్లవద్దనేది.

"ఏం మందు పెట్టిందో అది. తీరిక దొరికితే చాలు అటే పోతారు" అంటూ మళ్లీ అందుకునేది. కానీ తను, బంటీ బామ్మ మాటలు పట్టించుకునేవారు కాదు.

బామ్మ ఈ విషయం మమ్మీకి కూడా ఫిర్యాదు చేసింది. పేషెంట్లతో నవ్వుతూ వాళ్ల కష్టసుఖాలు తెలుసుకుని పంచుకునే అమ్మ తనకి తెలియకుండానే బామ్మ మాటల ప్రభావంతో కామేష్ ఆంటీమీద ద్వేషం పెంచుకుంది. తననీ, బంటీని మందలించింది ఎన్నోసార్లు వాళ్లింటికి వెళ్లవద్దని. కానీ వాళ్ళు మానలేదు.

కామేశాంటీ సితార్ వాయిస్తుంటే చెవులు రిక్కించి వినేవాళ్ళు. ఆమె రకరకాల పెయింటింగ్స్ వేస్తూ వుంటే కన్నార్పకుండా చూసేవాళ్ళు ఆ అందాలని. అవన్నీ గుర్తుకొచ్చి కళ్లు చెమ్మగిల్లాయి. కన్నీరు చెంపలవరకూ జారకముందే కర్చీఫ్‌తో తుడుచుకుంది సింధూజ.

***

'పందిట్లో పెళ్లవుతున్నది...' ఒకవైపు, 'ఆనందమానంద మాయెనే మా సీతమ్మ పెళ్లికూతురాయెనే' ఒకవైపు, రకరకాల బ్యాండ్లు, సన్నాయిల మృదు మధుర గాన లహరుల హోరులో ఇంద్రతేజ, సింధూజ మెళ్లో మంగళసూత్ర ధారణ చేసాడు మూడుముళ్లువేసి.

తలంబ్రాల వర్షంలో తడిసి ముద్దయ్యారు సింధూ, ఇంద్రలు. తరువాత వరుసగా చదివింపులు! వెండి బంగారాల బహుమతులు వాళ్ల వాళ్ల హోదాను

బట్టి అటు సింధూ ఎంబియేకి, ఇటు ఇంద్రతేజ ఇంజనీర్‌కు కూడా. వారి మధ్యన మెల్లగా వచ్చి సింధూ చేతిలో పెట్టిన ఆ కాగితాన్ని ఆనందంతో అందుకుని అక్కడే విప్పి చూసింది సింధూజ. చిన్నగా తొంగి చూసాడు కుతూహలంతో ఇంద్రతేజ. ఒక అందమైన తల్లి, పండులాంటి మూడేళ్ల పాపని ఒళ్లో కూర్చోబెట్టుకుని చందమామని చూపిస్తూ బువ్వ తినిపిస్తున్న చిత్రం. పక్కనే ఏడాది బాబు చేతిలో రబ్బరు బంతి పట్టుకుని మురిసిపోతూ వీరికేసి చూస్తున్న దృశ్యం.

వెంటనే తన్మయత్వంతో తేలిపోతున్న సింధూజ కళ్ళు నీటి కుండల య్యాయి.

అందులో తనకి తనూ, బంటీ కనిపించారు. ఈ చిత్రాన్ని ఏ మ్యూజియం లోనైనా పెడితే అంటీకి బహుమతి వచ్చేదేమో! అనుకుంటూ ఆమెకి పాదాభి వందనం చేసింది సింధూజ.

ఆ దృశ్యం నిఖిలని చిన్నబుచ్చింది. ఆమె అహాన్ని మేల్కొలిపింది. అన్ని బంగారు, వజ్రాల నగలని పెట్టినప్పుడు కూడా సింధూజ కళ్లల్లో ఆ కాంతిని చూడలేదు.

కానీ ఈ పెయింటింగ్స్‌కి ఆమె కళ్లల్లో మెరిసిన కాంతులకి, వజ్రాలు వెల వెలబోయాయి.

క్షణం ఆవేశంలో కామేశ్వరిపై విపరీతమైన కోపం వచ్చింది. కానీ వెంటనే వివేకం ఆవేశాన్ని అణచివేసింది.

ఇన్నేళ్లూ తను ఏం పోగొట్టుకుందో తెలిసేసరికి అవకాశం చేజారిపో యింది. సింధూ, ఇంద్రతేజ సొత్తయిపోయింది.

పశ్చాత్తాపంతో కళ్లంట జలజలా కన్నీళ్ళు ప్రవహిస్తుంటే సింధూజని తని వితీరా ముద్దు పెట్టుకుంది నమస్కరించడానికి వచ్చిన ఆ దంపతులను చూసి. మొదటిసారిగా ఆమెలోని మాతృత్వం పెల్లుబికి సునామీలా పొంగింది. కామే శాంటీ దేవతలా కనిపించింది.

ఆప్యాయంగా కామేశ్వరి దగ్గరకు వెళ్లి "మీరు వేసిన బొమ్మ బాగుంది కాదు...కాదు చాలా బాగుంది. నా కళ్ళు తెరిపించింది'' అంటూ ఆమెతో కర చాలనం చేసింది.

"నిఖిలగారూ! ఏమిటిది? మీరు డాక్టర్. ఎందరికో ప్రాణభిక్ష పెడుతు న్నారు. నేను చేసింది మామూలు పని'' అంది కామేశ్వరి నమ్రతతో.

"కాదు...కాదు... అందరికీ ప్రాణభిక్ష పెట్టి నా బిడ్డలకి క్షోభ మిగిల్చిన మూర్ఖురాలిని. కెరియర్‌కీ, ఫ్యామిలీకి మధ్యనున్న సన్నటి పొర బాధ్యతా బంధం. అది తెలుసుకోలేకపోయాను. ఈ సంపదంతా ఎందుకు? ఎవరి కోసం? సంపాదన పోతే సంపాదించుకోవచ్చు. లేకపోయినా ఫర్వాలేదు. కానీ బంధాలు పోతే? కంటికి చూపు పోయినట్టే. దేహానికి ప్రాణం లేనట్టే'' కన్నీరు కారుస్తున్న నిఖిలని గుండెలకు అదుముకుని ఓదార్చింది కామేశ్వరి.

వృత్తికీ, ప్రవృత్తికీ మధ్యనున్న పొర జీవితం. కరిగిపోయే సన్నని రేఖ. దుఃఖాన్ని ఆపుకుంటూ గద్గదంగా అంది నిఖిల.

"నాలాగా చాలామంది ఆలోచిస్తారు పిల్లలకోసం బోలెడు డబ్బు సంపా దించి పెట్టేస్తే చాలని. పిల్లలకి సంపాదన అన్నా, దాని విలువన్నా తెలీని వయ సులో 'అమ్మే కావాలి, నాన్నే ఉండాలి' అని కోరుకునే దశలో వేరొక చోట వాళ్ల నుంచడం మంచిదికాదు. ఇతరులు ఎంత చేసినా వాళ్ల మనసులో అమ్మానా న్నల బొమ్మలే ఉంటాయి. పిల్లలు ఆ ముచ్చట కోసం తహతహలాడతారు. అమ్మానాన్నలు, ఆ పసిపాపల ఆటపాటలూ ఆ పసి హృదయాల్లో కమ్మని ఊహలు, మాతృత్వంలోని లేలేత సొగసులూ కోల్పోతారు. అవి చిన్నప్పుడు పిల్లలు ఎక్కడ ఎవరిదగ్గర పొందగలుగుతారో అవే గుర్తుండిపోతాయి. డబ్బు వాటిని తెచ్చివ్వలేదుకదా. రెక్కలొచ్చేంతవరకే తల్లి రెక్కల చాటున వెచ్చద నంతో ఆనందాన్ని పొందుతాయి పక్షులు సైతం. రెక్కలొచ్చాక గూడు వదిలి వెళ్లిపోవూ?'' వెక్కి వెక్కి ఏడుస్తున్న నిఖిలని గుండెలకు అదుముకుని ఓదా ర్చింది కామేశ్వరి.

***

మురళీ, బంటీ కలసి సామాన్లు కార్లో ఎక్కిస్తున్నారు.

"బామ్మా...జాగ్రత్త... నాకోసం దిగులు పడకు. నేను తరచూ మాట్లాడుతూ ఉంటాను. అక్కా, బావా ఇక్కడే ఉంటారుగా. కలుస్తూ ఉండు. ఎప్పుడూ అంటావుగా పురాణ కాలక్షేపానికి వెళ్లడంలేదని. వెళుతూ ఉండు. ఆరోగ్యం జాగ్రత్త. వెళ్లగానే నీకే ఫస్ట్ ఫోన్. ఓకే బై... '' పెద్దవాడిలా అప్పగింతలు పెడుతూ అమ్మానాన్నలతో బయలుదేరుతున్న బంటీ కళ్లల్లోని ఆనందం వర్ణ నాతీతం.

బామ్మ కళ్లల్లోని నీళ్లల్లో కనిపించింది ఒక్క బంటీ రూపమే. యాంత్రికంగా చెయ్యూపింది 'బై' అన్నట్లుగా!

★

## విచిత్రమైన కల

రెండవప్రపంచయుద్ధంలో అర్‌కిప్ మాకిమ్‌కో అనే రష్యా నివాసి మూగవాడయ్యాడు. 40సంవత్సరాల పాటు మూగవాడిగా ఉండగా అత నికో విచిత్రమైన కల వచ్చింది. శత్రువులతో యుద్ధం చేస్తుండగా వారికి పట్టుబడ్డాడు. ఇతని వద్ద ఏ ఆయుధమూ లేదు. ధైర్యంతో పెద్ద పెద్ద కేకలు వేస్తూ శత్రువుల మీద పడి చితకబాదాడు. ఇదంతా కలలోనే. ఆశ్చర్యంగా అలా కలలో అరచిన అరుపులకు అతడికి మళ్లీ మాటలు వచ్చాయి.

## బిలియర్డ్స్ ఆట

ఈ బిలియర్డ్స్ ఆట దాదాపు మన క్యారమ్‌బోర్డు లాంటిదే. క్యారమ్స్‌లో కాయిన్స్ వాడుతారు. బిలియర్డ్స్‌లో చిన్న చిన్న బంతులు వాడతారు. అయితే ఈ ఆటను ఎప్పుడు, ఎవరు ప్రవేశపెట్టారన్న వివరాలు తెలియరా లేదు. పరిశోధన చేయగా ఫ్రాన్స్‌ను 1429 నుంచి 1461 వరకూ 11వలూయి అనే రాజు పరిపాలించే రోజుల్లో ఈ ఆట అమలులో ఉన్న ట్లుగా ఆధారాలు దొరికాయి. ఆ తర్వాత బ్రిటీష్‌వారు 1591నుంచి దీన్ని వెలుగులోకి తెచ్చారు. అలా ఈ ఆట ప్రపంచవ్యాప్తమైంది.

-రమణకుమార్

